శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి కృతులు



కృష్ణపక్షము
ప్రవాసము
ఊర్వశి

శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి కృతులు



కృష్ణపక్షము
ప్రవాసము
ఊర్వశి

శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి కృతులు

కృష్ణపక్షము
ప్రవాసము
ఊర్వశి

పబ్లిషర్స్
రౌతు చంద్రయ్య అండ్ సన్సు
రౌతు బుక్కు డిపో
రాజమండ్రి.
౧౯౩౮

ఐదవ ముద్రణము - ౧౯౫౮

వెల రూ 2.50 న.పై

శ్రీపతి ముద్రణాలయము
కాకినాడ.

కృష్ణపక్షము

శ్రీశ్రీశ్రీ మహారాజా
రావు వేంకట కుమార మహీపతి
సూర్యారావు బహద్దరు వారికి

తరుణ శృంగార మధుర మాధవుఁడ వీవు,
కలికిపాటల కోయిలకొలము మాది;
తావకీన సభావన తరువితాన
శాఖికల నిత్యనూతన స్వాదుగాన
జీవసారముఁ గురియించి చివురులెత్తఁ
బాడుకొన్నారు మాకులస్వాము లెల్ల
స్వచ్ఛకీర్తి ! మనోజ్ఞ వసంతమూర్తి !
పికకూచూరకు నన్నుఁ బాడుకొన నిమ్ము,
మూలగాఁ దొలిపాటలు పూలతోడ
హృదయమే కూర్చి నీకొఱ కెదురుమాతు!

1. ఆకులో ఆకునై పూవులో పూవునై

ఆకులో ఆకునై పూవులో పూవునై
కొమ్మలో కొమ్మనై నునులేత రెమ్మనై
ఈ యడవి దాగిపోనా ఎట్లైన నిచటనే యాగిపోనా?

గల గలని వీచు చిరుగాలిలో కెరటమై
జల జలని పారు సెలపాటలో తేటనై
ఈ యడవి దాగిపోనా ఎట్లైన నిచటనే యాగిపోనా?

పగడాల చిగురాకు తెరచాటు తేటినై
పరువంపు విరిచేడె చిన్నారి సిగ్గునై
ఈ యడవి దాగిపోనా ఎట్లైన నిచటనే యాగిపోనా?

తరు వెక్కి యల నీలగిరి నెక్కి మెలమెల్ల
చద లెక్కి జలదంపు నీలంపు నిగ్గునై
ఈ యడవి దాగిపోనా ఎట్లైన నిచటనే యాగిపోనా?

ఆకలా దాహమా చింతలా వంతలా
ఈ కరణి వెర్రినై యేకతమ తిరుగాడ
ఈ యడవి దాగిపోనా ఎట్లైన నిచటనే యాగిపోనా?

2. ఇదె వచ్చుచున్నాను ప్రియురాలా

ఇదె వచ్చుచున్నాను ప్రియురాలా!
ఇక నిలువలేను నా ప్రియురాలా!

చిరకాల మీ యెడద చెరలో నిమిడి నేడు
పొరలి పొంగెడు దుఃఖ ఝరులపై పరువెత్తి || ఇదె వచ్చుచున్నాను ||

ఈ విరహసంతాప మీ ప్రవాసక్లేశ
మే పగిది సహియింతు నెటులు జీవింతున్? || ఇదె వచ్చుచున్నాను ||

ఆవలి దరి నీ పిలుపు పవలు రేలును మ్రోయ
మివుల తొందర నసుపు నవసి తపియించున్! | ఇదె వచ్చుచున్నాను ||

శూన్యలోకము దాటి శుష్కదేహము దాటి
యన్యోన్య నిబిడ నిత్యాశ్లేష కాంక్షతో ||ఇదె వచ్చుచున్నాను ||

3. ఈ నిశీథ మధ్యమ్మున నే నొకండ

ఈ నిశీథ మధ్యమ్మున నే నొకండ
ఘోర కాంతార కుటిల కఠోర వీథు
లందు తిరుగాడుదును భయమంద గాని
లోకమోహన తారావిలోకనముల
వలదు కనుసైగ చేయగా వలదు నాథ!

ఇంచు కేనియు వెరవ స్వామీ, త్వదీయ
పాణినిర్గత నిర్ఘాత పాతమునకు;
ప్రళయ జంఝా ప్రభంజన ప్రబలధాటి
వడకు శైశిరవల్లికా పత్ర మటుల
హృదయము చలించు భవదీయ వదనసీమ
ప్రణయ దరహాస కౌముది పరిమళింప!

ఇ మ్మహావిశ్వ మల్లలాడించు నీదు
బొమముడి కషాయ వీక్షణస్ఫూర్తి చిమ్ము!
బురదలో క్రుళ్ళి పొరలాడు పురుగు నెత్తి
కాంత, చేర్చుకు మోయి నీ కౌగిలింత!

---

4. ఎంత బరు వయ్యెనో గాని యెడద వెలికి

ఎంత బరు వయ్యెనో గాని యెడద వెలికి
తొలగి పారని దుఃఖాశ్రు జలము వలన
ప్రావృ డంభోధర స్వామి, నీవు కూడ
నా వలెనె జాలి వొడమ వాపోవుచుంటి
ఒక్క టొక్కటె కన్నీటిచుక్క లొలుక
నేడ్వ లేక యేడ్వ లేక యేడ్చుచుంటి,
నెచ్చెలీ, యే నెరుంగుదు, నీవు కూడ
నొక్కమారు గాటంపు నిట్టూర్పు విడుతు,
తెలియ రాని తెలుప లేని తీక్ష్ణతాప
మెదియ లోలోన నిన్ను వేగించునేమొ!

ప్రావృ డంభోధర స్వామి, జీవనంపు
భారము తొలంగి పోవ నెవ్వారి కేని
కోరి నీ సొదలను జెప్పికొందు వేమొ -
గొణుగు కొనుచుందు వయ్య, యొక్కొక్కవేళ!
ఇట్లె విలపించి కృశియింతు నేను, నీవొ
హోరు హోరున నీ మనసార నేడ్చి
జిలుగు వలిపెంపు వన్నె చీరల ధరించి
కులుకు నవ్వుల పవడాల తళుకుతోడ
పొడుపుచెలి కడకో, సంజపడతి కడకొ
పోయి యాటల పాటల ప్రొద్దు పుత్తు.

ఎడతెగని యాత్ర నిట్లు సాగింప లేక
యేడ్వగా లేక కృశియింతు నే నొకండ!

5. ఎట్లు ని న్నూహసేయుటో యెరుగలేక

ఎట్లు ని న్నూహసేయుటో యెరుగలేక
వంగి వంగి శిరము వాంచి క్రుంగిపోదు!
రాజరాజేశ్వర కిరీటరాజ ఘటిత
రత్న మాణిక్య కాంతినీరాజ నార్చి
తాంఘ్రి నీరేజ యుగళుడ వయ్యు! చింపి
పాతలం గట్టికొని జీర్ణ పటకుటీర
పాళికా ప్రాంగణముల నివాస మేల?
శిథిలతర భాజనమ్ము నీ చేత బూని
తూలి సోలుచు నిరుపేద తోడ గూడి
యీవె దెసమాలి నటుల నింటింటి కేగ
నేల? దీనుడవై బిచ్చ మెత్త నేల?
చిత్రములు స్వామి, నీ వింత చేత లెల్ల!
ఎట్లు ని న్నూహసేయుటో యెరుగ లేక
వంగి వంగి శిరము వాంచి క్రుంగిపోదు!
కలుష బాష్ప కల్లోలినీ కణములందు
తళుకు తళు కని నాట్యాలుసలుపు నీ య
నంత రా గాంశుమాలికా కాంతి దేవ!
క్షామ దేవతా నిశ్వాస ధూమపటలి
చల్లగా వెల్లివిరియును స్వామి, నీదు
భవ్య కరు ణార్ద్రవీక్షణ పరిమళములు.
చండ మృత్యు గభీర గర్జారవముల
పల్లవింతువు నవ్య విపంచివోలె
మాధురుల జిమ్ము నీ కంఠ మంజురవము.
చిత్రములు స్వామి, నీ వింత చేత లెల్ల!

మౌనిగానమ్ములకు నించు కేని గాని
మారు మాటాడగా బోవు, మన సొసగవు,
శ్రితజనావళి నమ్ర సంసేవనముల
కలరి తల యూప వీవు,'ఊ' యైన ననవు;
సార్వభౌముల వినయ పూజావిధాన
మెడద మెచ్చవు, వారి కన్నెత్తి కనవు.
ఎట్లు ని న్నూహచేయుటో యెరుగలేక
వంగి వంగి శిరము వాంచి క్రుంగిపోదు!

6. ఎన్నడో మీరు పాడిన దీ వసంత

ఎన్నడో మీరు పాడిన దీ వసంత
మధుర జీవనగీతి! హేమంత దీర్ఘ
యామినీ మధ్యవేళయే యైన, నేడు
కూడ, నా యెద, త్రుళ్ళింత లాడుచుండు;
నవ్య భాగీరథీ దివ్యనది విధాన,
నేడు కూడ సోత్సవ నృత్య మాడు లోన.

పొంగి, పరవళ్ళు త్రొక్కి, యుప్పొంగి, పొరలు
ఈ యమృతపూర్ణ సురవాహినీ తరంగ
శిఖరముల నాడు నొక కొన్ని చిన్ని చినుకు
లీ హృదయ గహ్వరము దాటి, యీ గళమ్ము
నతిశయించి, పైపయి చిందులాడుచుండు.

కనులు విచ్చి మనసు విచ్చి కాంచగలుగు
వారి తల యూచి మెచ్చుచున్నారు వాని.

7. ఏటి పని యిది లోకమా! హృదయ దళన

ఏటి పని యిది లోకమా! హృదయ దళన
దారుణ మహోగ్ర కార్యంబు తలచినావు;
ప్రణయ మధురిమ మెరుగవు, పాప మనవు,
పక్షములు దూల్తు, బంధింతు పంజరాన;
వెర్రి లోకమ! హృదయంపు స్వేచ్ఛ నెటులు
పంజరంబున బంధింతె? పాదపమున
కూడియుందు మెల్లప్పుడు కొమ్మమీద
ప్రవిమల ప్రేమ విహగ దంపతుల మగుచు!

8. ఏడ జనిన మనోహరి జాడ లరసి

ఏడ జనిన మనోహరి జాడ లరసి
కలగు హృదయంబు, నెమ్మది చలన మొందు
కనులు మూసిన, లోకమోహన మనోజ్ఞ
మూర్తి చిరునవ్వు జిలుకుచు మ్రోల నిలుచు.

హృదయ మక్కట! నవసుమ మృదుల మగుట
విరహ బాధ కన్నీరుగా వెడలరాదె?
అతి భయంకర సాంద్ర నీలాభ్ర పటలి
వాన గురిసిన ధవళిమ బూను గాదె?

పూత గోదావరీ స్రవంతీ తరంగ
మాలికా డోలికల నూగు మలయ పవన!
ఏల కొంపోవు, హృదయంబు నేర్చి వెడలు
వేడి నిట్టూర్పు గాడ్పుల వెలది కడకు?

పొంగి కిలకిల నవ్వి యుప్పొంగి పొరలు
తరగలార, నా బాధల దలప రయ్యొ!
ప్రాణనాథుండు మీ యుడురాజు మిమ్ము
వీడి నప్పుడు త్రుళ్ళింత లేడ కరుగు?

జలనిధులు దాటి యున్న తాచలము లెక్కి
హృదయ మది యేమొ క్రిందు మీ దెరుగకుండ
పక్షివలె రెక్కలం దాల్చి పరువు లిడును
మాటిమాటికి వలపుల పేతి కడకు!

9. ఏది నీ కిత్తు నందువా హృదయనాథ!

ఏది నీ కిత్తు నందువా హృదయనాథ!
కాన్కగా నే మొసంగగా గలను నీకు?
తారకారత్న భాసుర తారహార
సుప్రభా మాలికాజాల శోభితుడవు,
రాజరాజేశ్వరుడ వీవు, ప్రభుడ వీవు,
హృదయపతి వీవు! భవదీయ పదసరోజ
మృదు రజోలేశ దివ్య సంపదను వలచి
వీథి వీథుల వాడల విపినములను
భిక్షుకునిబోలె తిరుగాడు పేద నోయి!
కాన్కగా నే మొసంగగా గలను నీకు?
గాఢ లజ్జానుతాప సంకలిత హృదయ
నీరజదళాల రాలు కన్నీటిచుక్క
గాక-మనసార, వల పూర, గలత దీర
గాన్కగా నే మొసంగగా గలను నీకు?

---

10. ఏను గాటంపు నిద్దురలోన మేను

ఏను గాటంపు నిద్దురలోన మేను
మరచువేళల భవదీయ మధురవేణు
మృదులగాన పక్షముల పై మెల్ల మెల్ల
నేగుదెంచి మామక శుష్క హృదయ పాత్రి
నింపివైతువు ప్రణ యార్ద్ర నిస్వనముల!

అంత మేల్కాంచి యెంతొ దాహమ్ముగొన్న
శ్రవణముల విచ్చి నీ గీతరవము కొరకు
కడల పరికించి శూన్యలోకమ్ము కాంచి
హోరు హోరు మటం చేడ్తు నోయి స్వామి!

---

11. ఏను మీ వలెనే కంఠ మెత్తి పాడ

ఏను మీ వలెనే కంఠ మెత్తి పాడ
నెంతో యుబలాటపడి సవరింతు గొంతు;
ఏను మీ వలెనే న వానూన గాన
విస్తృత వ్యోమ యానాల వెడలి వెడలి
భావలో కాంచలమ్ముల వాల వలతు!

ఐన నే మాయె! ఆపుకోలేని పాట
యెడద రొదసేయునో లేదొ యింకిపోవు
నంతలోననే కటకటా! యంతులేని
దారిలేని శోకంపు టెడారు లందు!

అంత లజ్జా విషాద దురంత భార
వహనమున కోర్వ లేని యీ పాడు బ్రతుకు
వంగిపోవును మరిమరి క్రుంగిపోవు
లో తెరుంగని పాతాళ లోకములకు!

మూగవోయిన నాగళమ్మునను గూడ
నిదురవోయిన సెలయేటి రొదలు కలవు-
ఐన నే మాయె -

---

12. ఏ నెరుంగుదు, చిర నూత నానురాగ

ఏ నెరుంగుదు, చిర నూత నానురాగ
బంధముల కట్టువడుట, స్వప్నములనేని,
యెన్నడునుగాని, యెచ్చోటనేని, నిముస
మేని, యెడబాటు మీరు సహింపలేరు.

ఏ నెరుంగుదు, రామభూజాని మీరు,
కరము కరమున కీలించి, కాంతిసీమ
లందు, స్వచ్ఛంద నిత్యవిహారపరత
మెలగుచుందురు కాబోలు -

మీ యమూల్య
జీవిత సుమాల నే నృపశేఖరునకు
నర్పణము చేసి, రట్టి సూర్యావనీంద్ర
చంద్రు నౌదల నాశి షాక్షతల మీరు
చల్లుచుందురు కాబోలు -

13. ఏ మనోహర సీమలం, దే పవిత్ర

ఏ మనోహర సీమలం, దే పవిత్ర
విమల తేజోమయ విశాల వీథులందు,
అక్ష రామోద సంభరి తాంతరంగు
లగుచు, విహరించుచున్నారొ, అమృతగాన
మధుర మందాకినీ భంగమాలి కాంబు
శీకర వితాన మోహన చిత్రనటన
మెన్ని యెన్ని రీతుల చూపుచున్నవారొ,
పూర్ణవికసిత జీవితపుష్ప కమ్ర
సౌరభమ్ముల చిమ్ముచున్నారొ, ఎల్ల
దెసల భవదీయ సుందర దివ్యరూప
నవ్యరోచిస్సు కురియుచున్నారొ మీరు!

---

14. ఓయి సంధ్యా సమీరణా, రేయి తోడ

ఓయి సంధ్యా సమీరణా, రేయి తోడ
కారు చీకటి తోడ దుఃఖమ్ము కూడ
పరువు పరువున నా కొరక కరుగు దెంచు
నీదు నునులేత రెక్కల మీద వడిగ
నెత్తికొని పోవరాదె న న్నెచటి కేని
నిత్య తేజో మ యానంద నిలయమునకు!
నిముస మేనియు నిట నుండనేర నోయి!

సంజ మబ్బుల పవడాల చాయ లందొ
తరణి బంగారు కిరణాల మెరుగు లందొ
లీన మొనరింప రాదె యీలోన నన్ను?
మధుర సంధ్యా సమీర కుమార, దీను
మనవి విని యేగ రాదె యే మలయగిరికొ?
మధుర సంధ్యా సమీర కుమార, నన్ను
తోడుకొని యేగరాదె నీతోడ గూడ!

---

15. కన్నీటి కెరటాల వెన్నె లేలా?

కన్నీటి కెరటాల వెన్నె లేలా?
నిట్టూర్పు గాడ్పులో నెత్తావి యేలా?
ప్రళయకాల మహోగ్ర భయద జీమూ తోరు
గళ ఘోర గంభీర పెళపె ళార్భటులలో
మెర పేలా?

ఆశనిపాతమ్ముతో నంబు వేలా?
హాలాహలమ్ములో నమృత మేలా?
ప్రబల నీరం ధ్రాభ్ర జనిత గాఢ ధ్వాంత
నిబిడ హేమంత రాత్రీ కుంతలములలో
చు క్కేలా?

శిథిల శిశిరమ్ములో చివు రేలా?
పాషాణపాళిపై ప్రసవ మేలా?
వికృత క్రూర క్షుధా క్షుభిత మృత్యు కఠోర
వికట పాండుర శుష్క వదన దంష్ట్రాగ్నిలో
న వ్వేలా?

కన్నీటి కెరటాల వెన్నె లేలా?
నిట్టూర్పు గాడ్పులో నెత్తావి యేలా?

16. కలుష దుర్దాంత పంక సంకలిత కుహర

కలుష దుర్దాంత పంక సంకలిత కుహర
ముల జనించు మదీ యాశ్రు మలినధార
స్వామి, భవదీయ పాదదేశమున బారి
పరమపావన జాహ్నవీ ప్రతిభ గాంచు.

గాట మగు లజ్జవలన దుఃఖమ్మువలన
నా కనుల జారు నుష్ణాశ్రు శీకరములు
హృదయము కలంచి విదలించి యేర్చి వెడలు
సాంద్రశోణిత బిందు వర్షమ్ము సుమ్ము!

తావకీన పదసరోజ దళములందు
నిలువని మ్మొక్క వేడి కన్నీటిచుక్క!
కడల ప్రసరించు నెత్తావి కమ్మదనము
త్రావని మ్మో ప్రభూ, దాని తనివి తీర!

17. కిలకిలని నవ్వు చెలులతో కలసి మెలసి

కిలకిలని నవ్వు చెలులతో కలసి మెలసి
పువ్వువై మబ్బువై చిన్ని పుల్గు వౌచు
ప్రసవ కోమల రమణీయ పథము పట్టి
పోవుచుందువు లావణ్య మూర్తి వీవు.

ఏనొ దీనుడ నే నీడ నైన నొదిగి_
అడు గిడగ లేక నిటూర్పు విడువ లేక
పొరలు కన్నీటి కాల్వలు గురియ లేక_
ఏనొ దీనుడ నే నీడ నైన నొదిగి
కాంచెదను నిన్ను కనులార కరవు దీర!

ప్రసవముల జల్లి గానసౌరభము లల్లి
ప్రవిమ లానంద నృత్యోత్సవముల దేల్చి
నిన్ను వలపింప బూనుదు రెన్నొ గతుల.

ఏనొ దీనుడ నే నీడ నైన నొదిగి_
హృదయ నేతవు భవదీయ పదసరోజ
మృదు రజోలేశ దివ్య సంపదను వలచి
ఎడద కలగించి విదళించి యేర్చి వెడలు
వేడి నిట్టూర్పు గాడ్పుల పెదవు లదర
నా మనోహరి నిన్ను గన్నార గాంచ
నలవి గాకుండ దుఃఖాశ్రు సలిలమౌక్తి
కం బొకటి నాదు ప్రణయ వీక్షణము గప్ప_
ఏనొ దీనుడ నే నీడ నైన నొదిగి
మ్రోడునై రాయినై నిల్చిపోదు నకట!

18. క్రౌర్య కౌటిల్య కలుష పంకంబు వలన

క్రౌర్య కౌటిల్య కలుష పంకంబు వలన
మలిన మౌ నా హృదయము ధామ మెటు లయ్యె
నతివిశుద్ధము మధురము నఘరహితము
ప్రణయమున కంచు సందియపడుదు వేమొ!

ప్రేయసీ! శర్వరీ తమోవీథుల బడి
చందురుడు రాడె పూర్ణతేజస్వి యగుచు?
అఘవిదూషిత మీ హృదయంబునందె
ప్రేమ కోమలతమము పవిత్ర మయ్యె.

---

19. గుత్తునా యని జాతి ముత్యాల్

మహాకవి (గురజాడ అప్పారావు)

గుత్తునా యని జాతి ముత్యాల్
గుచ్చినాడే మేలి సరముల
ఇత్తునా యని తెలుగుతల్లికి
ఇచ్చినాడే భక్తితో!

నవ వసంతము నవ్య వనరమ
మావి కొమ్మల కమ్మ చివురులు
పాట పాడెడి పరబృతంబును
ఎవ్వ రాపుదురో?

పొడుపుమల పయి రంగవల్లిక
మింటి నడుమ ప్రచండ తేజము
సంజమబ్బుల పైని కెంపులు
చూడ రైతిరిగా!

రంగవల్లిక మాయ మయ్యెను
చండ తేజము మాసిపోయెను
సందెకెంపులు సాగిపోయెను
వెదకుచున్నారా!

కారుచీకటి క్రమ్మినప్పుడె
చదలు మబ్బులు కప్పినప్పుడె
మిణుగు రైనను మెరయనప్పుడె
వెదకుచున్నారా!

చుక్క లన్నియు సొక్కి సోలెను
గిరులు కదలెను, తిరుగ పాడెను
లోకమోహన మధురగానా
స్వాదమోదమున.

యుగయుగంబులనుండి మ్రోగెడు

విశ్వగాన వియత్తరంగిణి
భంగముల నుప్పొంగు నాతని
గీతశీకరముల్

పాట పాడిన పరబృతంబును
మూగవోయిన ముద్దుకోయిల
చిన్నిపికములు చిరుతపాటల
పిలుచుచున్నవియా!

20. చల్లగా నున్న దీ సుప్రశాంత వేళ

చల్లగా నున్న దీ సుప్రశాంత వేళ
చల్లగా సాగు నీ సుప్రశాంత పథము
బయలుదేరుము దూరంపు బయనమునకు
వలదు తడయగ, ద వ్వేగవలయు నేడు.

నవన వోల్లాస మధుర గానంబు వలదు
ప్రవిమ లానందచంద్రికల్ పనికిరావు
అల్ల నల్లన గొంతెత్తి యాలపింపు
పరమపద శాంతిపూర్ణ నిర్వాణ గీతి.

ఒక్క టొకటె యదృశ్య మౌ చుక్క లెల్ల
అల్ల నల్ల నాశలుకూడ నంతరించె;
తిమిరమో దివ్యతేజమో తెలియకుండ
నాకసం బటు వెర గయ్యె లోక మెల్ల.

వెడల లేక వెడల లేక వెడలు చెలికి
వీడ్కొలుపు లిచ్చు జాలిగా విహగకులము
ఆపుకోలేక పొరలు సంతాప మెల్ల
తరళ తుహినాశ్రుధారల తరులు గురియు.

ఎన్నడును లేని రీతి తోతెంచె నేమొ
మెల్లమెల్లన మాంద్యము చల్లదనము
కలిగి నునులేతగాలులు కవికుమార!
ఎచటి కేగుచు నుంటివో యేమొ నేడు!

21. చిన్ని పూవే వాడెనా తన

చిన్ని పూవే వాడెనా తన
కన్నె వలపుల వేడెనా తన
చిన్నె లన్నియు వన్నె లన్నియు
మన్నులో కోల్పోయెనా ?

కాంతు నెరుగని కన్నె గాదా
సిగ్గు వీడని మొగ్గ గాదా
మొన్న మొన్ననె ముద్దు వల్లిని
మొనలు దీరెనుగా!

22. జయము జయము

జయము, జయము
లలిత సుమనోజ్ఞ కావ్య మంజుల లతాంత
మాలి కాభరణా! వినిర్మల విశేష
సుగుణమాణిక్య దివ్యతేజోవిరాజ!
దీనజన హృద యాంతర స్థిరవిహార!
రామరాయేంద్రు శ్రీ సూర్యరాయ, జయము!"
అను స్తుతిధ్యానములు, జగ మంత క్రమ్మి,
యంబరపథాల మార్మ్రోగునపుడు, మీరు
మువ్వు రొండొరులం గాంచి మురియునపుడు,
గర్వమున నృత్యమాడు మీ కంటిచూపు,
లధర సాంధ్యప్రభల దరహాసరేఖ,
మింట మిలమిల చుక్కలై మెరయునేమొ!
వెన్నెలై వినువీథుల విరియునేమొ!

---

23. జిలుగు వసనాల మణిమయోజ్జ్వల మనోజ్ఞ

జిలుగు వసనాల మణిమయోజ్జ్వల మనోజ్ఞ
కాంచ నాంచిత భూషణగణము పూని
రాజవీథుల రతనాల రథము నెక్కి
వెడలు నిర్జీవ పాషాణ విగ్రహంబ!
చిమ్మ చీకటి పొగల నిశీథ మందు,
క్షుద్ర మందిరాంతర జీర్ణ కుడ్యతలము
లందు కన్నులు మూసి, యానందవశత,
యోగవిజ్ఞాన మబ్బిన యోజ, నొడలు
మరచి కులుకు దివాంధమా! మెరుగు లొలుకు
చలువరాతి మేడల చెరసాల లందు,
తళుకు బంగారు సంకెళ్ళ దాల్చి, లోక
పాలకుని బోలె మురియు నో బానిసీడ!
ఓ కుటిల పన్నగమ! చెవి యొగ్గి వినుడు!
ఏను స్వేచ్ఛా కుమారుడ నేను గగన
పథ విహార విహంగమ పతిని నేను
మోహన వినీల జలధరమూర్తి నేను
ప్రళయ ఝంఝూ ప్రభంజన స్వామి నేను!

---

24. తలిరాకు జొంపముల సం

తలిరాకు జొంపముల సం
దులత్రోవల నేల వాలు తుహినకిరణ కో
మల రేఖవొ! పువుదీవవొ!
వెలదీ, యెవ్వతెవు నీపవిటపీవనిలోన్?

కారుమొయిళ్ళ కాటుకపొగల్
వెలిగ్రక్కు తమాలవాటి నే
దారియు కానరాదు, నెలతా!
యెటువోయెద వర్ధరాత్రి - వి
స్ఫార విలోచ నాంధ తమసమ్ముల
జిమ్ముచు, వేడి వేడి ని
ట్టూరుపులన్ నిశీథ పవ నోర్మి
వితానము మేలుకొల్పుచున్?"

"అది శరద్రాత్రి; శీత చంద్రాత పాంత
రాళ రమణీయ రజత తల్పంబునందు
చల్లగా నిద్రవోవు వ్రేపల్లెవాడ
సకల గోపాల గోపికా జనముతోడ.

సాము సడలిన పతి పరిష్వంగమందు
సుఖము దుఃఖము లేని సుషుప్తిలోన
స్వప్నవీథీ యథేష్ట సంచార కలన
మేను మరచిన న న్నంత మేలుకొలిపె
శర్వరీ శీత పవన పక్షముల మలసి
స్వాదు యమునోర్మి సంగీత ఝురుల గలసి
కౌముదీధౌత శుభ్ర దిక్తటుల సొలసి
మురళికా మందమంద మాధురుల రుతులు.

ఎలదేటి చిరుపాట సెలయేటి కెరటాల
బడిపోవు విరికన్నె వలపువోలె
తీయని మల్లె పూదేనె సోనల పైని
తూగాడు తలిరాకు దోనెలోలె
తొలిప్రొద్దు తెమ్మెర త్రోవలో పయనమై

పరువెత్తు కోయిల పాటవోలె
వెల్లువలై పారు వెలది వెన్నెలలోన
మునిగిపోయిన మబ్బుతునకవోలె

చిరుత తొలకరివానగా చిన్ని సోనగ
పొంగి పొరలెడు కాల్వగా నింగి కెగయు
కడలిగా పిల్లగ్రోవిని వెడలు వింత
తీయదనముల లీనమైపోయె నెడద.

పరువు పరువున పోవు నెదతో
పరువు లెత్తితి మరచి మేనే
మరచి సర్వము నన్ను నేనే
మరచి నడిరేయిన్."

"ప్రాణనాయకు కౌగిలి పట్టు వదలి
యిల్లు వదలి యెన్నండు నీ పల్లె వదలి
యడుగిడని దాన; వా నాటి యర్ధరాత్రి
విజన పథముల బడి యెట్లు వెడలినావు?"

"తావులతోడ తేనియల
ధారల నిప్పిలు వేణుగీతికా
రావముతోడ మందగతులన్
జను మారుతముల్ విశాల బృం
దావన వీథులందు యమునా
నవభంగ మృదంగ వాద్యముల్
త్రోవ స్ఫురింపగా వలపు
తొందర వెట్టగ బోతి నొంటిమై.

సన్నని యెల్గెత్తి జాలిగా నెవరినో
యరయుమా! పిలుచుచున్నదియె యమున!
పక్ష నిర్జీవ ధావళ్యమ్ముతో నున్న
సికతాతలమ్ము గాంచితివె, దాని?
తుది మొదల్ లే దిదే త్రోవరుల్ త్రొక్కని
యీ దారినే పరువెత్తినాను!
ఈ మొండిచేతుల నెత్తి యీ వనతరుల్
శూన్యదృక్కుల దిశల్ చూచు నయ్యో!

ఇచటనె, యిచటానె యత; డిచట నేను -
ఇచట నీ జాజిపూ బొదరింట నేను -
ఈ కడిమిచెట్టు క్రింద సుమ్మీ యతండు -
సరిగ కన్నుల గట్టిన సరణి దోచు.

శారద శర్వరీ మధుర చంద్రిక,
సూర్యసుతా స్రవంతికా
చారు వినీల వీచిక, ప్రశాంత
నిశా పవనోర్మి మాలికా
చారిత నీప శాఖిక, కృశాంగిని
గోపిక నేను, నాడు బృం
దా రమణీయసీమ వినినారము
మోహన వేణుగానమున్.

మలయ పవను కౌగిలిలోనె పులకరించి
హాయిగా కంఠ మెత్తు ప్రాయంపు వంశి
విశ్వమోహను జిలిబిలి పెదవు లంటి
యవశమై పోయి యేమి చేయంగ లేదు!

బాలగోపాలు బోలెడు పాటగాని
కని విని యెరుంగ మెన్నండు; కరములోని
మురళినే కాదు, నాలోని మ్రోడు టెడద,
నీ శిథిల జీవనమ్ము మ్రోయింప గలడు.

నందగోప కుమారు నానంద మురళి
కా మనోహర సుషి రాపగా తరంగ
జాలముల తారకా రవి చంద్రతతులు
కరగి చిని చిన్ని గీతులై కలసిపోవు.

చూవితివొ లేదొ చిన్ని కృష్ణుని సొబంగు?
పెదవి చివురు సంజల నరవిచ్చు నవ్వు
వెన్నెల, చలించు తుమ్మెద బెళుకు చూపు,
లోల పవన చాలిత కుటి లాలకమ్ము,
తరళ చూడా కలాపమ్ము, మురళి గూడి
యల్ల నల్లన గొంతెత్తి యమృతగాన
శీతల తుషారముల విరజిమ్ము వేళ

చిన్ని కృష్ణుని సొబగు చూచితివొ లేదొ?
లేవు శర త్తమస్వినులు
లేవు మనోజ్ఞ సుధాంశు మాలికల్
లేవు మదీయ గాత్ర లవలిం
బుల కాంకుర కోర కావళుల్
లేవు కుమారగోప మురళీ మృదుగీత ఝరీ విలాసముల్!

జిలిబిలి పట్టురేకుల వెన్న తొట్రిలు
మల్లియ యెద దాగు మధుప రవము
కనుచూపు దాటు నామని బాయు కోయిల
గొంతులో చిక్కు వసంతగీతి
విభు వీడి శుష్కించు విరహిణి సెలయేటి
కడుపులో నడగిన కడలి మ్రోత
రేనికై వెదకెడు రిక్కచూపుల లోన
చెరవడ నిండుచందిరుని పాట

యిట్టు లీ దీన గోపికా హృదయ మంది
రాంతరాళము లోన త్రుళ్ళింత లాడు
వేణు నాదంబు, వినిపించు విశ్వమోహ
నాకృతి కిశోరగాయకు నరయుచుంటి.

ఇది నా చరితము; విని నీ
వదరెదు తొట్రిలెదు వడకు దటు నిటు కనులన్
జెదరెడు చూపుల నేదో
వెదకెదు! ఎవ్వతెవు నీపవిటపీవనిలోన్?"

25. తిమిరలత తారకా కుసుమముల దాల్ప

తిమిరలత తారకా కుసుమముల దాల్ప
కర్కశ శిలయు నవజీవ కళల దేర
మ్రోడు మోక చివురు లెత్తి మురువు సూప
జగమునిండ స్వేచ్ఛాగాన ఝరుల నింతు.

క్రౌర్య కౌటిల్య కల్పిత కఠిన దాస్య
శృంఖలములు తమంతనె చెదరి పోవ
గగనతలము మా ర్మోగగ కంఠ మెత్తి
జగమునిండ స్వేచ్ఛాగాన ఝరుల నింతు.

చిత్త మానందమయ మరీచికల సోల
హృదయ మానంద భంగమాలికల దేల
కనుల నానంద జని తాశ్రుకణము లూర
జగమునిండ స్వేచ్ఛాగాన ఝరుల నింతు.

యుగయుగంబుల నీశ్వరయోధు లగుచు
స్వేచ్ఛకై ప్రాణసుమము లర్పించువారి
అమల జీవిత ఫలము ధన్యతను గాంచ
జగమునిండ స్వేచ్ఛాగాన ఝరుల నింతు.

భయము గలిగించు కష్టాతపంబు మరచి
కరము కలగించు వంత చీకట్లు మరచి
విశ్వమే పరవశ మయి వెంట బాడ
జగమునిండ స్వేచ్ఛాగాన ఝరుల నింతు.

26. దినము దినమెల్ల నైదాఘ తీక్ష్ణ భాను

దినము దినమెల్ల నైదాఘ తీక్ష్ణ భాను
భీకర కరానలచ్ఛటల వేగి వేగి
శీతల నిశా ప్రశాంత శయ్యా తలాన
నిట్టె కనుమోడ్చె గాదె నా హృదయసుమము!
అలసటం దూలి, నిర్జీవ మటుల సోలి,
జాలి గొల్పును గాదె! నీ వేల స్వప్న
మటుల లోలోన కలచి, చీకటి ముసుంగు
నొత్తిగిల ద్రోసి, వదలని పొత్తు గోరి
తొంగి తొంగి చూచెద వయ్యొ దుఃఖమా! యొ
కించు కైనను జాలి వహించ వేమి?
సగము వాడిన మృదుల పుష్పమ్ము సుమ్ము,
నిదుర పోనిమ్ము లేకున్న నేల వ్రాలు!

27. నన్ను గని యేరు జాలి జెందంగ వలదు

నన్ను గని యేరు జాలి జెందంగ వలదు -
ఎవ్వ రని యెంతురో నన్ను? - ఏ ననంత
శోకభీకర తిమిరలో కైకపతిని!
కంటకకిరీట ధారినై, కాళరాత్రి
మధ్యవేళల, జీమూతమందిరంపు
కొలువుకూటాల, నేకాంతగోష్ఠి దీర్చి,
దారుణ దివాంధ రోదనధ్వనుల శ్రుతుల
పొంగి యుప్పొంగి యుప్పొంగి పొరలి పోవు
నా విలాప నిబిడ గీతి కావళీ వి
రావముల నర్ధరాత్ర గర్భమ్ము, మరియు
మరియు భీషణ కాళి మోన్నత్త గాగ
చేయు తరి, నన్ను మీరు వీక్షింప లేదొ!
నన్ను గని యేరు జాలి జెందంగ వలదు -
నాకు నిశ్వాస తాళవృంతాలు కలవు,
నాకు కన్నీటి సరుల దొంతరలు కలవు,
నా కమూల్య మపూర్వ మానంద మొసగు
నిరుపమ నితాంత దుఃఖంపు నిధులు కలవు -
ఎవ్వ రని యెంతురో నన్ను? -

---

28. నవ వసంత శుభోద యానందవశత

నవ వసంత శుభోద యానందవశత
ప్రకృతి నుతన జీవలావణ్య మొంద
రాయి రప్పయి కంఠస్వరంబు దాల్చి
నైజగుణము త్యజించి గానంబు సేయ
పికమ, పాడకు మనుచు శపించినారు!

---

29. నవవికస్వర దివ్య సౌందర్య మూర్తి

నవవికస్వర దివ్య సౌందర్య మూర్తి
విశ్వసుందరి పరమ పవిత్రమూర్తి
ఉదయలక్ష్మి యవతరించె; నెదురు వోయి
స్వాగతం బిమ్ము గీతికా ప్రసవ మొసగి!

అవిరళ స్వేచ్ఛ వెన్కముం దరయ బోక
వారిదమ్ములు చిత్ర కాశ్మీర రుచుల
బూని విహరించు పశ్చిమ భూధరమున;
రజని రా నున్న దంచు తెల్పంగ రాదె?

శ్యామ లాంబర పరిణాహ సరసిలోన
ప్రణయ లీలా విహర విలాసిను లగు
తారకల గాంచుమా! నీ హృదయము నందు
భావ నక్షత్ర కాంతులు పర్వు నేమొ!

30. నవ్య మోహన కోకి లానంద గీతి

నవ్య మోహన కోకి లానంద గీతి
దరవికస్వర సుమ మనోహర సుగంధ
మనిల భంగంబులను గొట్టుకొనుచు బోయె
నెచటికో యని చింతిల నేటి కోయి!

31. నవ్విపోదురు గాక నా కేటి సిగ్గు?

నవ్విపోదురు గాక నా కేటి సిగ్గు?
నా యిచ్ఛయే గాక నా కేటి వెరపు?
కలవిహంగమ పక్షముల దేలియాడి
తారకా మణులలో తారనై మెరసి
మాయ మయ్యెదను నా మధురగానమున!
నవ్విపోదురు గాక నా కేటి సిగ్గు?

మొయిలు దోనెలలోన పయనం బొనర్చి
మిన్నెల్ల విహరించి మెరపునై మెరసి
పొడుచు చిన్కునై పడిపోదు నిలకు
నవ్విపోదురు గాక నా కేటి సిగ్గు?

తెలిమబ్బు తెరచాటు చెలి చందమామ
జతగూడి దోబూచి సరసాల నాడి
దిగిరాను దిగిరాను దివినుండి భువికి
నవ్విపోదురు గాక నా కేటి సిగ్గు?

శీకరంబులతోడ చిరుమీలతోడ
నవమౌక్తికములతో నాట్యమ్ము లాడి
జలధి గర్భమ్ము లోపల మున్గిపోదు
నవ్విపోదురు గాక నా కేటి సిగ్గు?

పరువెత్తి పరువెత్తి పవనునితోడ
తరుశాఖ దూరి పత్రములను జేరి
ప్రణయ రహస్యాలు పల్కుచు నుందు;
నవ్విపోదురు గాక నా కేటి సిగ్గు?

అలరుపడంతి జక్కిలిగింత వెట్టి
విరిచేడె పులకింప సరసను బాడి
మరియొక్క ననతోడ మంతనం బాడి
వేరొక్క సుమకాంత వ్రీడ బో గొట్టి
క్రొందేనె సోనల గ్రోలి సోలుటకు
పూవు పూవునకును పోవుచునుందు;

నవ్విపోదురు గాక నా కేటి సిగ్గు?

పక్షి నయ్యెద చిన్ని బుక్ష మయ్యెదను
మధుప మయ్యెద చందమామ నయ్యెదను
మేఘు మయ్యెద వింత మెరపు నయ్యెదను
అలరు నయ్యెద చిగురాకు నయ్యెదను
పాట నయ్యెద కొండవాగు నయ్యెదను
పవన మయ్యెద వార్ధిభంగ మయ్యెదను
ఏలొకో యెప్పుడో యెటులనో గాని
మాయ మయ్యెద నేను మారిపోయెదను.
నవ్విపోదురు గాక నా కేటి సిగ్గు?
నా యిచ్ఛయే గాక నా కేటి వెరపు?

ప్రవాసము

అంకితము రామమూర్తికి

1. అపుడు గొంతెత్తి యేడ్చినాను

అపుడు గొంతెత్తి యేడ్చినాను; అపుడు నన్ను
కాంచగా నోపగా లేక కన్ను లట్టె
యార్చికొనినవి తారకలు; అపుడు మొగిళు
లల్లనల్లన నలనల్లనై భరమ్ము
లైన నిట్టూర్పుదొంతర లైనవి; అపుడు
కుంచుకొని కుంచుకొని కుహూకుహరవాటి
నను తొలగి దవ్వు దవ్వులు చని శిరాలు
వాల్చికొనినవి తిమిరాలు భయవశాన;
అపుడు బ్రతు కొక్కటే యేడు పైన గాలి
రిచ్చవడి వట్టి పసిపాపలీల మౌన
యానమున బారి సుప్తపత్త్రాళి నొదిగి
పొంచి చూచుచు చలియించి పోయినాడు;
అప్పు డీ విశ్వమే నిత్యయాత్ర నాగి
శ్రవణములు మూసికొనినది; రాక రాక
నా గళతమఃపథమ్ముల రేగి రేగి
రోద నోచ్చలి తోచ్చగీతా దురంత
దుస్సహార్చులు వెడలి రాగా...

---

2. ఇది నితాంత తమఃక్రాంత మిది దరిద్ర

ఇది నితాంత తమఃక్రాంత మిది దరిద్ర
మీ నిశాంతమ్ము శూన్య, మిం దెన్నడో ర
హ శ్శిథిలసుప్తి కలవర మంది లేచి
గుబులుకొను లేత నెత్తావి గుసగుస లెవొ!

అంత నీ యంధమందిర మందు నొక్క
రెప్పపాటు వేకువ ఒక్క రెప్పపాటె
ఉన్మిషిత జీవ నాగమ నోత్సవమ్ము
ఉదిత గీతా ప్రవేశ ఘూర్త వేళ!

అప్పుడే గృహనే త్రవాతాయనముల
కొలుకులందు లే వెలుంగు తళుకు జివురు
లరుణ మసృణ తోరణ్ పంక్తు లల్లు నేమొ
ఆడు నేమొ వాడిన మోము లట్టె వాల్చు!

తెరచికొన్న ద్వారము చొచ్చి విరిసికొన్న
వాకిలిం జేరి, మంగళవాద్యపాళి
గద్గదిక వోవ సవరించి గళము, పాడు
నేమొ నిర్జీవ నిశ్శబ్ద మిట్టె మూగు!

మరల గ్రుడ్డిరాతిరి పడు, మరల నోరు
కాని శ్రుతులేని లేని చీకతులు మరల
మరల పాడిల్లు ...

3. ఇపుడు ప్రళయమ్ము క్రమ్మిన దేమొ

ఇపుడు ప్రళయమ్ము క్రమ్మిన దేమొ, కాక
దొరకదో నిల్వ నీడ నా చిరుతపాటకు,
ఇంత యిరు కౌనె యిమధానంత విశ్వ
మలమికొను చీకటుల కలకలమువలన!

ఎటు గనిన గాని ఆకాశ హృదయవాటి
సంకుల విషాద జలధర చ్ఛాయ లందు
పొంచు బాష్పాంబునిధులు ఘోషించు; నెగుర
పక్షములు దాల్చ వెరచు నా పాట నేడు!

దశదిశల చీల్చికొని రేగు దారుణ ప్ర
భంజ నోచ్చలి తోన్మత్త భంగ వీథి
నెగయు, నయ్యయో, లోకేశు నెడద వెడలి
యేడ్పు సందడు లెగయూర్పు లేర్చు పొగలు;
పొంచి పొంచి నాలో మూల మూలలందు,
క్రుంగి క్రుంగి యడంగి దాగుండు గీతి!

స్థాణు వయ్యెనొ, పాషాణ జడభరమ్ము
గనెనొ, కదలదు మెదలదు కంఠరవము;
నే డిదేమో క్షమాజననీ పురాణ
గర్భకుహరమ్ము విదలించి కారుచిచ్చు
టెరుపుమంట మూలుం గేదొ యేదొ ప్రాకె...
ఇపుడు ప్రళయమే!...

4. ఈ పయనపుం దెరువు ఇరుదెసల శిర సెత్తు

ఈ పయనపుం దెరువు ఇరుదెసల శిర సెత్తు
ప్రతికుజము ప్రతిసుమము ప్రతివిహంగమరుతము
అంతలో నా హృదయ మందు సంజియకావి
వింతలై నశియించునా, నా బ్రదుకు
సుంతేని సహియించునా!

అంతమే లేని నా యాత్రాపథాన నా
పదచిహ్నములు వోలె పడియున్న వెన్నెన్నొ
అడుగుజాడలు మదీ యార్ద్ర హృదయమ్ములో
నిశి కడుపులో తారలై, నిశ్శబ్ద
వాటిలో చిరుపాటలై!

వెను దిరిగి కను విరిసి వీక్షింతునా అంత
ప్రతిపద మ్మమృత జీవప్రతిభ పులకించి
పలుకరించిన క్రొత్త బలముతో చలముతో
పడి నడతు పవలు రేల, అజ్ఞాత
భావికాలపు యుగాల!

5. ఎన్ని యెన్ని నిశ్వాసము లెగసినవియొ

ఎన్ని యెన్ని నిశ్వాసము లెగసినవియొ
ఈ బ్రతుకె రూపు మాసిపోయినది గాని,
ఇంత విశ్వములో జాలి నింత నీడ
ఒదవగా లేద యొమ్మ నిట్టూరుపునకు.

కంట కురిసిన కార్చిచుమంట యేళ్ళ
కాలి నుసియై నశించె వాంఛా లవాలె;
ఏ రెరుంగుదు రని ఏ యెడారిదార్ల
నింకెనో చుక్కతడి జాడ యేని లేక.

కరుణపట్టున కీ బిచ్చగానిచేయి
చాచికొనినాడ మృత్యు ఘోషమ్మె మరచి;
వట్టిబయలున నొక మ్రోడుచెట్టు వోలె
ఎత్తినది మర మెత్తినట్లే కృశించె.

కనులు రెండును బండిచక్రము లయ్యె
చనవుచూపున కెరుకనవ్వునకు వెదకి;
ఎందులకొ వెర్రిమదిలోలె నిపుడు తిరుగు
చూపులే లేక అజ్ఞాత శూన్యసీమ.

స్వాగ తాశ్లేషమున విడజాలు నెదల
నల్ల ద్రావితి మున్ను దోసిళ్ళకొలది;
వలపుటాకలి స్రుక్కు నా బ్రతుకుమీద
ఇనుపపాదాల నిడి లోక మిపుడు నడుచు.

ఆశయమ్ముల ఆనందలేశముల, అ
లంతియాసల జీతిత మంత, ఇట్టె
యేడ్పువైచితి, వినువారె యేరు లేక
యేడ్పుసందడి నాలోననే చొరంగ!

వడవడ వడంకిపోదు జీవనపు కొనల
నెన్నడె నాసకళ తలయెత్తెనేని,
ఉభయ సంధ్యాంచలముల నెదో వెలుంగు

కలుగ కలవరపోవు ఘూకమ్ము వోలె.

మింట వెలుగు చుక్క గన్న మిణుగు రన్న
నేను సహియింపలే, నవ్వి యిరులు చెరుచు;
నాకు ప్రాణమే మెరపులే లేక యున్న
భాద్రపదమాసమున నమావాస్యరాత్రి!

రేయి కడుపున చీకటి చాయ వోలె,
తమసు టెడద దివాంధ గీతము విధాన,
ఘూక రావాన వలవంత రేక రీతి
నా విషాదమ్ములో దాగినాడ నేనె!

6. ఎవ రోహో, ఈ నిశీథి నెగసి, నీడవోలె నిలిచి

ఎవ రోహో, ఈ నిశీథి నెగసి, నీడవోలె నిలిచి
పిలుతు రెవరొ, మూగకనులు మోయలేని చూపులతో
ఎవ రోహో! ఎవరోహో!

ఇపుడా నను పలకరింతురు!
మ్రోయలేని నీరవగళమున చలించు కోరికతో
ఇపుడా నను పలకరింతురు!

ఎవరని ఈ రేయి నిదుర హృదయ మదర, వేయి చేయి
చాయలాడ పెనుచీకటి సైగలతో నా కన్నుల
రక్త మురల లాగికొందురు!

ఎవరో, నా హృదయనాళ మేలా తునియలుగా నా
నిర్జీవపు జీవితమ్ము నిట వదలుదురా!
ఎవ రోహో! ఎవ రోహో!
ఇపుడా నను పలకరింతురు?

---

7. ఏను తొలుత నే గూడేని లేని పులుగు

ఏను తొలుత నే గూడేని లేని పులుగు
రాయడ, వహించినాడ నా బ్రతుకు బాట
నాట నవయని రెక్క యుయ్యాల కొనల
తెరువె లేని, తీరమె లేని దివ్యసీమ!

అంత నే మారిపోతి సంధ్యామనోజ్ఞ
చిత్రసిందురరేఖగా, చేయి చెయిగ,
మెయి మెయిగ, హాయి హాయిగా మెలగినాను
పైడివన్నియతో నీలినీడతోడ!

నేను మెలమెల్ల రిక్కనైనాను; కాని
ఆ విశాల వినీలసౌధాంతికమున,
ఉండగలనా ప్రవాసినై ఉడుసఖాళి
పలుకరింపక యొక రెప్పపాటు వేళ!

ఇపుడు నే నొక్క తుదిరేయు యిరులచాయ
నెగసికొని చిమ్ముకొని నటియించుకొనుచు
అలము వెలుగుల పరువుల కులికి పారి
కుంచుకొని రిచ్చవడి క్రుంగి క్రుంగి యలసి
యిపుడు నే నొక్క తుదిరేయి యిరులచాయ
నై నశించుచున్నాను....

---

8. ఏను మరణించుచున్నాను; ఇటు నశించు

ఏను మరణించుచున్నాను; ఇటు నశించు
నా కొరకు చెమ్మగిల నయనమ్ము లేదు;
పసిడివేకువ పెండ్లిండ్ల పడిన యెవరు
కరగనేర్తురు జరఠాంధకఅరమృతికి?

నా మరణశయ్య పరచుకొన్నాను నేనె!
నేనె నాకు వీడ్కోలుపు విన్పించినాను!
నేనె నాపయి వాలినా, నేనె జాలి
నెదనెద గదించినాను, రోదించినాను!

బ్రతికియున్న మృత్యువునై ప్రవాసతిమిర
నీరవసమాధి క్రుళ్ళి క్రుంగినపు డేని
నిను పిలిచినాన, నా మూల్గునీడ ముసిరి
కుములునేమొ నీ గానోత్సవముల ననుచు?

ఇదియె నాచితి, పేర్చితి, నేనె దీని
వదలిపోని నా యవసానవాంఛ గాగ;
వడకని కరాలు రగులుచు దుడుకుచిచ్చు
లాలనల నింత నుసిగాగ కాలు త్రుటినె!

అలయు వాతెర యూర్పుగాలులు కదల్చి
రేపు నంతె నా కష్టాల రేగు మంట
మును బ్రతుకునట్లు నా దేహమును దహింపు!
పడదులే ఆర్పగా నొక బాష్ప మేని!

9. ఓ మానవోత్తమా!

ఓ మానవోత్తమా!
ఓ వీరమూర్ధన్య!
ఓ యమృతభాసమా
నోన్నతప్రేమసామ్రాజ్యైకచక్రవర్తీ!
స్నేహశీలి!

నీ హృదంతరములో నిరుపమా నాఖాత
రత్నాక రామూల్య రాగసంపద మొరయు!
నీ యాశయమ్ములో నిర్మ లోత్తుంగ ది
వ్యాకాశ సంకాశ భాగ్యరాసులు మెరయు!

ఈ యశ్రుఝరులతో, ఇరులతో, రొదలతో
సొదలతో, ఈ హాస మృదుల వాసనలతో
విసముతో, సిగ్గుతో, కొసరు తేనియలతో
ఈ పాట బ్రతుకు నీ కేపాటి దోయి, నా
నెచ్చెలీ!
నెచ్చెలీ!

10. దారు లన్నియు మాపె దిశదిశలు ముంచెత్తె

దారు లన్నియు మాపె దశదిశలు ముంచెత్తె
నీరంధ్ర భయ దాంధకార జీమూతాళి!
ప్రేయసీ, ప్రేయసీ, వెడలిపోయితి వేల
ఆ యగమ్య తమస్వినీ గర్భకుహరాల?

ఆ యఖాతంపు టేకాంతమ్ములో మ్రోసి
మాయమై మెల్లగా నీ యడుగుసందడులు
నా యెడదత్రోవనే పడి నడచిన ట్లయ్యె;
నా యెడదలోననే మాయ మైన ట్లయ్యె!

అంత నా గొంతులో 'హా ప్రియా' యను కేక
అంతంత దివి కేగె, అంతంత దిగి పోయె;
తారలే కను విచ్చి తమములే శ్రుతి విచ్చి
ఆ రవము విని నన్ను గని జాలి నొందాయి.

నాటి నుండియు నేను ప్రతి నిశీథతమంపు
కాటుకల చాయ నొరు లే రరయలేని తరి
చూచికొని చూచికొని శూన్యహృదయములోని
'కో చెలీ!' యని క్రుంగి క్రుంగి యేడ్తును సుమా!

సడిలేని నడిరేయి బడిపోయి నట్టి నీ
కడియాల రవళులే చిరుగాజు మ్రోతలే
వ్రే లెత్తి చూపు జీవితపథమ్ములు నాకు;
కే లెత్తి నడిపించు, నె ల్గెత్తి న న్బిలుచు!

ఊర్వశి

అంకితము ఊర్వశికే

1. అవధరింతువు ప్రతి దివ సాంతమందు

అవధరింతువు ప్రతి దివ సాంతమందు
నిత్యనూతన తాండవనృత్య కేళి,
ఓయి నటరాజ, తల లైన నూప లేక
భువనములు దుర్భ రానందమున నడంగ.

అప్పు డూహాంచలమ్ముల నతిశయించి
పొరలు నమృతరసంపు మాదురులలోన
కొట్టుకొని పోవు, స్వామి, నా క్షుద్రజీవి
తమ్ముగూడ దారియె లేక తనివి వోక!

అంత నే వెర్రి నైపోదు నయ్య; నిన్ను
బోలి పాడబోవుదు; నిన్ను బోలి నాట్య
మాడబోవుదు, లజ్జ బోనాడి; కాక
యింత దాహమ్ము దహియింప నెటులు మనుదు?

ఏ విధాన సౌందర్యరసైకజీవి
నిలువ నేరుతు నిట నొక్క నిముసమేని
మామకీన జీవిత శుష్కమార్గముల త్వ
దీయ పాదమంజీరముల్ మ్రోయకున్న!

ఆటతో పాటతో నేర్చినట్లు దేవ,
ఏనుకూడ నీ వలె నటియింప నిమ్ము
ఎడతెగనియాత్ర నెట్లో సాగించువరకు!
ఎట్లో నీ దర్శనమ్ము సాధించువరకు!

2. ఆ యనాథ బాలిక ప్రియురాలు నాకు

ఆ యనాథ బాలిక ప్రియురాలు నాకు!

ఆమె నవసాంధ్య సమయ మల్లీ మనోజ్ఞ
కుసుమకామిని; ఎదొ వింతకోర్కె తీయ
దనపు వేదన నా జీవితమున రేపు!

ఆమె స్వప్నాలు కను నెప్పు; డామె మేని
తలిరులావణ్య మొక్క నేత్రముగ విరిసి
వెరగుచూపుల తనుదానె యరసికొనును!

ఆమె సొగసు రేకులు విచ్చి యమృతమధుర
నటన వాసింపబోదు, గానమ్ము సేయదు;
ఆమె ప్రాయంపు వాకిళు లందు వలపు
తడబడి యడంగు సిగ్గుదొంతరల తెరల!

3. ఆమె కన్నులలో నసంతాంబరంపు నీలి నీడలు కలవు

ఆమె కన్నులలో నసంతాంబరంపు నీలి నీడలు కలవు;

విసిర్మలాంబు
పూర గంభీర శాంత కాసార చిత్ర
హృదయములలోని గాటంపు నిదురచాయ
లందు నెడనెడ గ్రమ్ము;

సంధ్యావసాన
సమయమున నీపపాదప శాఖి కాగ్ర
పత్ర కుటిల మార్గముల లోపల వసించు
ఇరుల గుసగుసల్ వానిలో నిపుడు నపుడు
వినబడుచు నుండు;

మరికొన్ని వేళ లందు
వానకారు మబ్బుల మెయివన్నె వెనుక
దాగు భాష్పమ్ము లామె నేత్రముల లోన
పొంచుచుండును;

ఎదియొ అపూర్వ మధుర
రక్తి స్ఫురియించుగాని అర్థమ్ము కాని
భావగీతమ్ము లవి ...

4. ఇది విభాత మహోత్సవమ్మెమొ

ఇది విభాత మహోత్సవ మ్మెమొ! ఇదియు
నూత్న కళ్యాణతూర్య మనోజ్ఞగాన
నృత్యకోలాహల మ్మొకో! ఇది సువర్ణ
మంగ ళాక్ష తాళీ ర్వర్ష మగునొ, కాదొ!

ప్రేయసీ! సుఖస్వప్న దరిద్ర మైన
బ్రతుకు నాది, నిద్దురవోవు వల్లకాడు;
నమ్మ గోరని బరువునేత్రమ్ము లెటులు
నులిమికొనునొ, పాపము, మేలుకొలుపె మరచి!

త్రిజగతీపతి కోటీర దివ్యరత్న
రాజి నేలు వజ్రాలతురాయి వీవు!
ఏనొ పాతాళ లోకంపు టిరుకుసందు
లందు దిగబ్రాక వెరచు గాఢాంధరేఖను!

తారకా పూర్ణ చంద్ర మార్తాండనింబ
మండితమ్ము మహాకాళ మంటపమ్ము
నందె కాదె పాణిగ్రహణమ్ము దొరకు;
పతిత వె ట్లౌదు? నే నెటు పక్షి నౌదు?

---

5. ఇన్ని కల్పాలు కాలు నా యెద నడంగి

ఇన్ని కల్పాలు కాలు నా యెద నడంగి
నాకు ప్రాణమె యగు వేదనాసుఖమ్ము
ఇదె పలుకరించు, నా సఖీ ఇపుడు నీ య
పూర్వ కరు ణార్ద్ర నీరవ మూర్తి యగుచు.
నే కురియలేని మూగకన్నీరు యుగయు
గాల నేత్రాల యశ్రువర్షాలు, కడుగ,
చల్లగా జాలి జాలిగా శాంతమధుర
ముగ నుషఃకాలకౌముదిసొగసు వైతి!

నీవు తొలిప్రొద్దు నునుమంచు తీవసొనవు
నీవు వర్షశరత్తుల నిబిడసంగ
మమున బొడమిన సంధ్యాకుమారి, వీవు
తిమిరనిశ్వాసముల మాసి కుములు శర్వ
రీ వియోగకపోలపాళికవు, నీవె,
నీవె నిట్టూర్పు, నీవె కన్నీరు, విశ్వ
వేద నామూల్య భాగ్య మీవె, నిజమ్ము
నే గళమ్మార పాడుకొనిన యఖాత
శోకగీతమ్ములం దీవె శోకగీతివి!
ఊర్వశీ! ప్రేయసీ!

6. ఈ నడికి రేయి వెన్నెలయెద చలించు

ఈ నడికి రేయి వెన్నెలయెద చలించు
పిలు పెదో 'నా సఖా' యని వేగిరించు;
అనలమై కాల్చు నిశ్శబ్దమునె; కలంచి
పరువు లెత్తించు కడల నా బ్రతుకు నిపుడు!

ఎన్ని మారులు సవరించుకొన్న చూపు
తొలగ వేమో యలము నేమొ నెల మొగాన
చెదరునే బెదరి బెదరి చెలియకురులు
జాలిగా నీలమేఘ నిశ్వాసము లటు!

నా కొరకె చాచు సఖికంఠనాళమందు
మ్రోగక చలించి చెరవడ్డ మూగబాధ
ఎటు పిలుచు నన్ను ఆ చూపుటిరుల; కనులె
పలుక నేరక విడి విడి పగులు నేమొ!

అయ్యయ్యో! ఊర్వశీ విషా దార్ద్రమూర్తి
ఈ నిశీథాన, నా హృదయాన, నిండె,
పూర్ణిమా శుభ్రయామిని బొగ్గువోలె
ఈ యెడదవోలె కాలిపోయినది నేడు.

ప్రాణసఖి! నీ సుదూర తల్పమున సుప్తి
కట కలలు రావు, కలుగదు కలవరింత,
వేగిపో దిట నీ కయి వేలు రేలు
బ్రతుకు బ్రతు కెల్ల ఒక్కనేత్రముగ కాచి!

7. ఈ నవా బ్దాగమముతో ఈ కిశోర

ఈ నవా బ్దాగమముతో ఈ కిశోర
మధుర కలకంఠమునకు హేమంత మెడలి
గొంతుచెర వీడెనేని, హృదంతరమున
దాగి యొదిగిన ప్రేమగీతాల రుచుల
నొక్క టొకటె నీకయి విప్పుచుండు సకియ!

విరిసికొనిపోవుచున్నవి వీని యమృత
గళ రవమ్మున కపుడె పక్షములు చెలియ!
ఎగసికొనిపోవు నొరు లెవ్వ రెగురలేని
స్వప్నసీమల కూహాప్రపంచములకు!

నీ వొకర్తుక వానిపై నిదుర గొమ్ము;
చల్లగా పోదు వెచటి కెచ్చటికొ గాని;
ఇపు డపుడు నీవు మేల్కొంతువేని, వీని
పాటరెక్కలరొద వినంబడును నీకు;
అంత జ ల్లను నీ బ్రతు కంత; మరల
ఒత్తిగిలి హాయి గన్ను మూయుదువు నీవు!

నాకుమాత్రము గాన మున్నంతవరకు
చాలుచాలు నీ ప్రణయవిశ్వాస మొకటె,
మోసికొందునొ నా గీతములను నిన్ను!
మూగవోదునొ రాయియైపోయి చిరము!

---

8. ఈ మిడిసిపాటు నీ మ్రోల నేల తేనె

ఈ మిడిసిపాటు నీ మ్రోల నేల తేనె
తేట చిను కేని లేని యీ పాట కిపుడు?
ఇంత చివు రిచ్చి యంత హేమంత శృంఖ
లాల బంధింతు మూగతనాల గొంతు!

స్వామి! నూత్న వసంతజీవ ప్రవాళ
పల్లవమ్ముల రుచులె నా బ్రతుకుజీర
కోసి తీయదనమ్ములు వోసి నపుడె
వెడలిపడలేద! యొక యడు గిడగలేద!

మూడులోకాల బరువుల మ్రోత నడగి
యడగి చిదికెను గద అంధజడము తాను!
ఓయి గాయకసార్వభౌమా! యి వేటి
తగని తుళ్ళింత వెలితినృత్యమ్ము లోయి!

9. ఎదలోపలి యెదలో

ఎదలోపలి యెదలో, నె
మ్మదిలో, జీవిత రహస్యమార్గమ్ములలో
వదలని కోరిక వై, నా
బ్రదుకుబరువు లెల్ల పాట పాడింతు సఖీ!

చలువపిసాళిగాలి నునుచక్కిలిగింతల కౌగిలింతలన్
నిలువున పాటగా కరగనేర్చునొ నీరవ వేణువీథి! నీ
వలపుతలంపు సోకిననె, ప్రాణసఖీ! బ్రతు కెల్ల కోటి గొం
తుల విడి సోనలై పొరలు నూతన గీత సుధాపథాలలో!

నీ యాజ్ఞ కూడెనా, గొంతుముడి వీడెనా
హాయిగా యుగయుగంబుల కలల్ పాడనా!
చిర గాఢనిద్ర మేల్కొలిపి సందేశాల
పరపనా దిక్కు దిక్కులకు చుక్కలకు!

---

10. ఏను నిద్దుర వోదునో యేమొ, కరుణ

ఏను నిద్దుర వోదునో యేమొ, కరుణ
సెలవు గైకొన కేగగా వలదు; ఇన్ని
నాళ్ళ యెడలేని యెడబాటు నా నిరీక్ష
ణమ్ము బరువులు బరువులై నయనయుగళ
మయ్యె, దిగలాగు నిద్దురమరపులకును.

ప్రియతమా, ఇక నిదురింతు పిలువబోకె,
బాసిపోకు నిర్భాగ్యపు బ్రదుకు దాటి!
ప్రియతమా, పొరలి పొరలి మొయిళు లేవొ
మేలుకొననీవు రెప్పల వాలి యదిమి!

ఎటు లెగసి యెగసిపడుదు! ఎటులు బేల
కేల నిన్నంటి యదిమికో తూలిపోదు!
అబ్బ! నా బ్రతుకంట నీ యడుగుదోయి
నాప, ప్రియతమ శృంఖలమ్మై పెనంగ,
దిక్కుమాలిన యెడద బంధింపలేను!

ప్రియతమా, నిను వదలికోలేను, నిదుర
కడలియై కాటుకై కనుగవ నడంచు!
ప్రియతమా, వీడిపోకోయి, వీడలేని
నా మమతచిచ్చు కునుకునా నన్నుబోలి!

---

11. కలగు సుషుప్తి నొత్తిగిలగా

కలగు సుషుప్తి నొత్తిగిలగా
పడి లేచు ప్రభాతకాల శీ
తల హృదయంపు టూరుపులు తాక.
నిశా నిట లాంతసీమ శ్యా
మల లలి తాల సాలకలు
మందముగా నటియింప, రాలెనో
యలసెనొ స్వప్న మొం డవశ యై
పడె నా కనురెప్ప సెజ్జలన్.

నిన్న రాతిరి చికురంపు నీలికొనల
జారిపడిన స్వప్నమ్ము నిజమ్మొ, యేమొ!
కోమ లామోద కౌముదీ కోరకమ్మొ!
సుర విలాసవతీ ప్రేమచుంబనమ్మొ!

నిదురపొదిగిళ్ళ మెయి మెయి నొదిగి యొదిగి
వెడలినా మంట నందనవీథు లంట,
ఎరుగరాని దెదో కోర్కెబరువు వలన
తడబడి పెనంగు సోమరినడలు సడల!

అపుడు కావలి మొగసాల నా వనాన
నళికుమారుల హెచ్చరికలును లేవు;
అలరు టంతఃపురాలలో వలపు టెడద
నెగయబోదు నిడుదయూర్పు సెగయు కూడ.

మందాకినీ మందమంద గీతానంద
మధు మాధురీ శీత లహరీ పరిష్వంగ
మందు పులకించి, పుష్పించి, జీవించి యా
నంద నారామ మా వేళ నిదురించు.

రాసులుగాగ నేలపయి రాలుచు
పూవుల దూదిదారులే
చేసి నిశా సమీరణము చీలుచు
తావుల పారునేరులే

వోసి, సుకమ్ముగా నిదురవోవు
లతా లలితాంగి నోర్తుకం
డాసితి మంట; ప్రేయసియు
నా కయి గైకొనె నంట ఆగగాన్!

ఎదురుగా నిల్చి యెద నెద నదుము కొనెనొ,
కనులు కన్నుల కౌగిలి కరగ గనెనొ,
రెప్పపాటు తెర యయి నా హృదయపుటము
దెరచి నిలిచిన దొక బాష్ప తరళకణము!

మాయు నిశీథి కుచ్చెళుల మాదిరి
ప్రాకు వనీ మహీజపుం
జాయల కోమల ప్రణయ చంచలయౌ
వ్రతతీ సతీ గతిన్
ప్రేయసి వాలి, నిండు తెలివెన్నెల
వన్నెల మల్లెపూవులన్
దోయిలి చించి, నా చరణధూళుల
నౌదల నుంచి జాలిగాన్ -

"ప్రియతమా, దాసి యక్షయ ప్రేమసేవ
కీ లతాంతాల మొత్తాలు చాలు నోయి?
నింగి మూలలె నీలి పందుళ్ళు పరచి
యెంత తెలిమల్లెతోట వేయించినానొ!"

అడుగుల నడంగి జీవిక నరయ లేక
పిలుచు సెలయేటి నిస్సృ హోచ్ఛలిత కంఠ
కరుణ మాలింపగా లేక కరగ లేక
యచల పాషాణ హృదయ మే మౌనొ, పైన?

కోరిక లెల్ల ధూళి పడ
కోల్పడి దిక్కుల శూన్యదృక్కులం
జీరి, యెటో వృథా శిశిర
జీవితభారము బుచ్చుచున్న భూ
మీరుహ మేను; నా మొరడు మేన
నవ ప్రసవాల జాలులే,
ధారలు ధారలై పదము

దాక హిమాంబు తరంగ పాళులే!

కనుల వికసింతునేగదా గగన మలమి
చెలియ నాటిన తోటలో నలరు లేమొ!
కాక నా పాదముల మస్తకమ్ము తోడ
పూజకై పారబోసిన పూవు లేమొ!

విడని వాసన పదములు విరులె యయ్యె;
ఆననమ్మున నశ్రులే యార వయ్యె;
నిలిచినాడ నేటికి కూడ తొలి వసంత
కాలపు ప్రభాత తరుణ వృక్షమ్ము కరణి!

12. కలుగునా నాకు నీ వియోగమ్ము సకియ?

కలుగునా నాకు నీ వియోగమ్ము సకియ?
వాలు నీ కనురెప్పల జాలిచూపు
లల్ల దిగజారి దిగజారి, అమరనాథ
కంఠమాలా సుమదళాలు గాగ, గగన
వాహినీ నీర జాళినీ పక్ష నీల
నాట్యములుగ, తారా తోరణములు గాగ,
నింగి నీడల మెట్లుగా, నీలి మొయిలు
జిలుగువిరుపులుగా, పులుగులుగ, నలరు
లుగ, నలలుగా, కలలు గాగ, సొగయబోని
విసివికోని వింతవలపు వేడి వేడి
తొందరల పరువుల నెంత తూలి తూలి,
ఎంత దిగజారి దిగజారి, ఎంత వెదకి
వెదకి పడినవొ, పెంధూళి కదల లేక
వెలుగు లేక యెగుర లేని వీని కనులె
శిలలు గాక; వదలని కౌగిలి పెనంగ
బెదరు గాక లజ్జా గాఢ వేద నాగ్ని!

వదలునా యెట నెదు రేగి వెదకు వలపు!
కలుగునా నాకు నీ వియోగమ్ము, సకియ!

---

13. కలువపూ బ్రతుకులో కనుమోడ్చు వెన్నెలే

కలువపూ బ్రతుకులో కనుమోడ్చు వెన్నెలే
కాలానలం బైన గతి యేమీ!
నిరుపేద రెల్లులో నిదురించు సెలయేరె
కల్లోలమే యైన గతి యేమీ!

చలువతెమ్మెరజాణ చలచిత్తుడే కాని
మాలతీలతిక కీ మమతకౌగిలి యేలొ?
ఆగడమ్మే కాని మూగవేణువుగొంతు
మ్రోగునో హృదయమ్ము రాగిల్లు వరకేని!

నిదురలో స్వప్నాల కదలికే బరు వైన
కల లెల్ల కను విచ్చి కాల్చు నా గతి యేమి?
బ్రతుకులో భావాల పరిమళమె బరు వైన
భావాలె పరువమై బ్రతుకు నా గతి యేమి?

చివురాకు తెరలనే చిన్న వోవును కాదె,
విరజాజిమొగ్గనే విరియు మంటా రేమొ!
చదలేటి నీలాల ఝురులలో తారయా?
నటియింప నేర్చునా? నవయింప నోర్చునా?

---

14. కాలమే పసిపాప కనువిచ్చిన యుషస్సు

కాలమే పసిపాప కనువిచ్చిన యుషస్సు
కలగా కలవరించి వెలుగుగా పులకించి
ఇరుల కడు పొరసి నే తెరచి వాలిన నాడె
మిసిమి వన్నెల మేన మసి జాలిగా నయ్యె...
తొలి వియోగిని నేనె!
తొలి ప్రేయసిని నేనె!
ఆ నాటి కీ నాటి కేను నీ దాననే!

మున్నీటి తరగలకు మిన్నేటి నురుగులకు
తడయు నెడబా టేనె! విడని కౌగిలి నేనె!
వానచినుకున సొగసి వలపుచూపుగ నెగసి
పడిపోదువును నేనె! పరువులిడుదును నేనె!
తొలి వియోగిని నేనె!
తొలి ప్రేయసిని నేనె!
ఆ నాటి కీ నాటి కేను నీ దాననే!

హాలాహ లానలమె అమృత శీతల రసమె
తోడబుట్టులు నాకు! తోడునీడలు నాకు!
నిశి నీలి పదవిపై నిట్టూర్పుగా ప్రాకి
తొలిప్రొద్దు చెరగులో పలుకరింతగ సోకి...
తొలి వియోగిని నేనె!
తొలి ప్రేయసిని నేనె!
ఆ నాటి కీ నాటి కేను నీ దాననే!

వేయివేలుయుగాలు రేయినై, పవలునై
అడరి కురిసిన యేడ్పు అలరి విరిసిన నవ్వు
బరువుకానుకగ, మన భాగ్యబంధమ్ముగా
చేర్చికొని నాలోన కూర్చితిని నేకొరకె!
తొలి వియోగిని నేనె!
తొలి ప్రేయసిని నేనె!
ఆ నాటి కీ నాటి కేను నీ దాననే!

కలకాల మలయకే నిలువునా తెరచుకొని

ఎదు రరయు ని వలపుటింటి ప్రాంగణములో
తొలి ప్రేయసిని నేనె!
తొలి వియోగిని నేనె!
ఆ నాటి కీ నాటి కేను నీ దాననే!

15. తమి బిగిసిపోవు నొక్క సంధ్యావసాన

తమి బిగిసిపోవు నొక్క సంధ్యావసాన
సాంద్ర కాశ్మీర దృఢపరిష్వంగ మందు
నిమిడి, నిలు వెల్ల ఒదిగి శోషిలిన యామె
నేను తొలిసారి కాంచి కంపిలితి నాడు.

కార్మొయిలు పెదవుల ఖండఖండములుగ
చిదికిపోయిన కౌముదీ మృదులకళిక
కాంచి యొకరేయి దుస్సహ గాఢ దుఃఖ
మాపుకో లేక యేడ్చె నా యార్ద్ర మనము!

క్రొత్తరాక నొడలె యెరిగికొనని గాలి
తమకపుం గౌగిలింత తొందరల నలగి
యూపి రాడక మూర్ఛిలు నొక్క యలరు
గని వనట క్రుంగినా నొక్కదినము దినము.

వాడిపోయిన ప్రతి సౌరభమ్ము కొరకు
కనుమొరంగిన ప్రతి హిమకణము కొరకు
బ్రతుకు బ్రతు కెల్ల కరగు బాష్పములు కాగ,
ఎట్లు కననేర్తు నా నాటి దృశ్య మేను?

దారి తల లెత్తు నింత సౌందర్యలవము
వదలిపోలేరు చంపెడువరకు వీరు!
మృదుల కరుణా మధురము నా హృదయ, మెవ్వ
రెరుగజాలుదు రే మని యేడ్తు నెపుడు!

16. తుది మొదలు లేని దా నాటి తొలి నిశీథ

తుది మొదలు లేని దా నాటి తొలి నిశీథ
పుం దమము;
అఖాత మయ్యెది;
అందు దారి
లేదు; మిణుగురేనియు కానరాదు;
ఒకండ
పొంచి యొదిగితి నే మూల మూల లందు.

నాటి నిశీథ నీల గగనమ్ముపయిం
గనుమోడ్చు మేఘపుం
గాటుక కౌగిలింతల పెనంగి
సుకమ్ముగ నిద్రవోవు నీ
వేటికొ యొత్తిగిల్లి, తరళేక్షణ!
నూత్న వియోగ శోకపుం
జాటున స్రుక్కు దీను కనినా
వనురాగము మోసు లెత్తగాన్.

నీ కనుచూపుచీకటుల నీడల
నా యెద నిల్వలేదు, పే
రాకలి గొన్న నా బ్రతుకునందు
త్వదీయ మనోజ్ఞ హాసరే
ఖా కమనీయ కాంతిసుధ
కాల్వలు కట్టగలేదు, కాని యే
మో కలగున్ మనమ్ము
వలపుం దమకమ్మున ని న్దలంచినన్!

నవసి ద్వదీయమౌ కరమృణాళము
వీణియమీద మూగయై
యవశత వాలెనో!
అనలమై దహియించు విషాదబాధ డి
ల్ల వడెనొ నీ మనోజ్ఞ మధురమ్మగు కంఠము,
కారుచిచ్చు వే

సవి గళ మెత్తి పాడుటకు
చాలని సోనవిధాన ప్రేయసీ!

---

17. నవ నవ వసంతచరణముల నాట్యములా

నవ నవ వసంతచరణముల నాట్యములా
భవ దమృత లావణ్య వనస విలసనములా
మెరపులై పిలుపులై మెరసినవి! పలికినవి!

దిశల బడి పరువు లిడు శిశిరంపు టడుగులో!
తుది వీడుకొలువులో ముదుసలి నిరాశలో!
నీడలై జాడలై వెరచినవి! పరచినవి!

నా బ్రతుకు నేడు నందనచైత్రవన మౌనొ!
ప్రాభాతగగన పూర్వప్రాంగణ మ్మౌనొ!
చెర గొలగు జీవమో! మరపు విడు తేజమో!

నడక నెరుగని తేనె, ఎరక యెగురని తావి,
కయిసేసుకో లేక కలతవడు సోయగము,
పాటయై పక్షియై ఆశయై హాయియై
దెసదెసల మీరునో దివ్యపద మంటునో!

కదలు వేకువకనుల నిదుర చెదరెడు వేళ,
మాయు ప్రతితారకయు మబ్బుకల యౌ వేళ,
అలము స్వప్నము లొక్క వెలుగు రూ పౌ వేళ,
చేరితివి నా జీర్ణజీవిత ప్రాంగణద్వార మా వేళ
ఓ వసంతవిలాస మాధుర్యమా!
ఓ యుషఃకల్యాణ లావణ్యమా!

నేడు నా జీవితముకూడ నిర్జరాంగ
నా దరస్మిత మయి ప్రపంచాలు ప్రాకు!
పిలుచు నీరేడులోకాల ప్రేమకొరకు!
పరపు నా హృదయము చరాచరములకును!

18. నా కఠినపాద శిలల క్రింద బడి నలగి

నా కఠినపాద శిలల క్రింద బడి నలగి
పోయె నెన్నెన్నియో మల్లెపూలు మున్ను.

ధూళి కైవాలు మౌళిపై దాలిచికొన
ఇంత విరిదోటలో నపు డెంత వెదకి
వేచియున్నానో, విసువని వెర్రి కోర్కె
తొందరల చూపు లటు నిటు తూలినంత
హృదయముల నయనమ్ముల బెదరు కలత
మూసికొనబోని యొక ననముగుద లేదు.

నా కనుల క్రాగు చీకట్లు ప్రాకుచోట
లేదు నెత్తావి, మధువేని లేదు, లేదు
ప్రాణ, మొక్క లావణ్యలవమ్ము లేదు;
ఏను రుజనైతి, జరనైతి, మృత్యువైతి!

ఈ నిశావసానమ్మున, ఏ శుభాని
లమ్ము నిట్టూర్చెనో జాలి రాగ నేడు
వ్రాలె నా పాడు అడుగుల మ్రోల నొక్క
తారయే, యొక్క దివ్యమందార సుమమె!

మోహినీహాస మల్లీ ప్రఫుల్లరుచియె,
శ్రీలలిత వైజయంతీ పరీమళమ్మె,
హరజటా పారిజాత లతాంత మధువె,
నిర్దయానిశితమ్ము లీ నీచనఖర
ములకొసలె కోరి పరవశమ్మున చలించె!

ఇటు వడకు కేల దీని స్పృశింపలేను
వెరగు కనురెప్పరేకుల విరియలేను,
ఎటు లదిమికొందు నా మ్రోడుటెడద, ఎటులు
చెరగి నెరసిన చింపిరికురుల తాల్తు!



దేవులపల్లి కృష్ణశాస్త్రి
(నవంబర్ 1, 1897 - ఫిబ్రవరి 24, 1980)

దేవులపల్లి కృష్ణశాస్త్రి తెలుగు కవి. తెలుగు భావ కవితా రంగంలో కృష్ణశాస్త్రి ఒక ముఖ్య అధ్యాయం. ఆయన రేడియాలో లలితగీతాలు, నాటికలు, సినిమాల్లో పాటలు రాయడం ద్వారా ప్రఖ్యాతి పొందాడు. చిన్న వయసునుండే రచనలు ఆరంభించాడు. 1929 లో రవీంద్రనాధ టాగూరును కలసిన తరువాత ఆయన కవిత్వంలో భావుకత వెల్లివిరిసింది. 1945లో ఆకాశవాణిలో చేరి అనేక పాటలు, నాటికలు రచించాడు.

దేవులపల్లి కృష్ణశాస్త్రి తూర్పు గోదావరి జిల్లా, పిఠాపురం దగ్గరలోని రావు వారి చంద్రపాలెం అనే గ్రామంలో ఒక పండిత కుటుంబంలో 1897 నవంబరు 1న జన్మించాడు. అతని తండ్రి, పెదతండ్రి గొప్ప పండితులు. వారింట్లో నిరంతరం ఏదో సాహిత్యగోష్ఠి జరుగుతూ ఉండేది. కృష్ణశాస్త్రి చిన్న వయసునుండే రచనలు ఆరంభించాడు. పిఠాపురం హైస్కూలులో అతని విద్యాభ్యాసం సాగింది. పాఠశాలలో తన గురువులు కూచి నరసింహం, రఘుపతి వెంకటరత్నం ఆంగ్ల సాహిత్యంలో తనకు అభిరుచి కల్పించారని దేవులపల్లి చెప్పుకొన్నాడు. 1918లో విజయనగరం వెళ్ళి డిగ్రీ పూర్తి చేసి తిరిగి కాకినాడ పట్టణం చేరాడు. పెద్దాపురం మిషన్ హైస్కూలులో ఉపాధ్యాయవృత్తి చేపట్టాడు.

ఆ కాలంలో వ్యావహారిక భాషావాదం, బ్రహ్మసమాజం వంటి ఉద్యమాలు ప్రబలంగా ఉన్నాయి. కృష్ణశాస్త్రి తన అధ్యాపకవృత్తిని వదలి బ్రహ్మసమాజంలో చురుకుగా పాల్గొన్నాడు. అదే సమయంలో సాహితీ వ్యాసంగం కూడా కొనసాగించాడు. 1920లో వైద్యంకోసం రైలులో బళ్ళారి వెళుతూండగా

ప్రకృతినుండి లభించిన ప్రేరణ కారణంగా "కృష్ణపక్షం కావ్యం" రూపు దిద్దుకొంది. 1922లో భార్యా వియోగానంతరం అతని రచనలలో విషాదం అధికమయ్యింది.

తరువాత మళ్ళీ వివాహం చేసుకొని, పిఠాపురం హైస్కూలులో అధ్యాపకునిగా చేరాడు. కాని పిఠాపురం రాజుగారికి కృష్ణశాస్త్రి భావాలు నచ్చలేదు. కృష్ణశాస్త్రి ఆ ఉద్యోగం వదలి బ్రహ్మసమాజంలోను, నవ్య సాహితీసమితిలోను సభ్యునిగా, భావ కవిత్వోద్యమ ప్రవర్తకునిగా దేశమంతటా ప్రచారంలో పాల్గొన్నాడు. ఈ సమయంలో ఎందరో కవులతోను, పండితులతోను పరిచయాలు కలిగాయి. ప్రాచ్య, పాశ్చాత్య సాహిత్యాన్ని అధ్యయనం చేశాడు. పిఠాపురంలోని హరిజన వసతి గృహంతో సంబంధం ఏర్పరచుకొని హరిజనోద్ధరణ కార్యక్రమాలలో పాల్గొన్నందున బంధువులు అతనిని వెలివేశారు. అయినా వెనుకాడని కృష్ణశాస్త్రి వేశ్యావివాహ సంస్థను ఏర్పాటు చేసి ఎందరో కళావంతులకు వివాహాలు నిర్వహించాడు. సంఘ సంస్కరణా కార్యక్రమాలు నిర్వహిస్తూనే "ఊర్వశి" అనే కావ్యం వ్రాశాడు.

1929లో విశ్వకవి రవీంద్రనాధ టాగూరుతో పరిచయం ఏర్పడింది. వారిద్దరి మధ్య సాహితీ సంబంధాలు ఏర్పడ్డాయి. 1933-41 మధ్య కాలంలో కాకినాడ కాలేజీలో తిరిగి అధ్యాపకవృత్తిని చేపట్టాడు. 1942లో బి.ఎన్.రెడ్డి ప్రోత్సాహంతో మల్లీశ్వరి చిత్రానికి పాటలు వ్రాశాడు. తరువాత అనేక చిత్రాలకు సాహిత్యం అందించాడు. 1957లో ఆకాశవాణిలో చేరి తెలుగు సాహిత్య ప్రయోక్తగా అనేక గేయాలు, నాటికలు, ప్రసంగాలు అందించాడు.

భావ కవిగా, 'ఆంధ్రా షెల్లీ 'గా ప్రసిద్ధులైన దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి... బి.ఎన్.రెడ్డి ప్రోత్సాహంతో 'మల్లీశ్వరి (1951)'తో చిత్రరంగంలో అడుగుపెట్టారు. సినిమా పాటకు కావ్య గౌరవం కలిగించారు. ఆపాత మధురమైన కృష్ణశాస్త్రి సాహిత్యం ఇక్షురసార్ణవం వంటిదని శ్రీశ్రీ శ్లాఘించారు. లాలిత్యం, సారళ్యం, ప్రకృతి సౌందర్యం - కృష్ణశాస్త్రి పాటల్లోని ప్రధాన లక్షణాలు. భావోద్వేగాలకు, హృదయ స్పందనలకు అక్షర రూపమిచ్చి భావ కవితలంత సుకుమారంగా ప్రణయ విరహ గీతాల్ని రాసిన కవి. ఆత్మ నివేదన, ఆరాధన గల భక్తిగీతాలు కూడా అనేకం. రాజమకుటం, సుఖదుఃఖాలు, కలిసిన మనసులు, అమెరికా అమ్మాయి, గోరింటాకు మొదలైన చిత్రాల్లో 170 పాటలు మాత్రమే రాసిన కృష్ణశాస్త్రి, ఈ పన్నెండుగురు పద నిర్దేశకుల్లోనూ తక్కువ పాటలు రాసిన కవి.

'భక్త ప్రహ్లాద (1931)'తో ప్రారంభమైన తెలుగు సినిమా పాట ఎనభయ్యో పడిలో అడుగుపెట్టింది. ఈ ఎనిమిది పదుల కాలంలో సుమారు 400 మంది కవులు దాదాపు 34 వేల పాటల్ని (అనువాద గీతాల్ని మినహాయించి) రాశారు. ముఖ్యమైన జాబితా లో ఎవరు ఎంపిక చేసినా మహా అయితే మరో ఏడెనిమిది

మంది కవుల కంటే ఆ జాబితాలో చోటు చేసుకోరు. ఇలా గుర్తింపు పొందిన కవులను కూడా జల్లెడ పడితే, తమ ప్రత్యేకతలతో తెలుగు సినిమా పాటకు దిశానిర్దేశం చేసిన కవులు 12 మంది మాత్రమే అంటే కించిత్ ఆశ్చర్యం కలగక మానదు. అందులో ఒకరు ...దేవులపల్లి కృష్ణశాస్త్రి.

గొప్ప వక్తగా, రచయితగా, భావకవుల ప్రతినిధిగా పేరుపొందిన కృష్ణశాస్త్రి గొంతు 1963లో అనారోగ్యకారణంగా మూగవోయింది. కాని అతని రచనా పరంపర కొనసాగింది. అతనికి అనేక సన్మానాలు ప్రశంసలు లభించాయి. 1980 ఫిబ్రవరి 24న కృష్ణశాస్త్రి మరణించాడు.